సాక్షి కామారెడ్డి

గురువారం । 16 । అక్టోబర్ । 2025



ఇళ్ల నిర్మాణాలు వేగవంతం..
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.
- 10లో ▸



సమయపాలన పాటించని..
సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /21.5

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఉదయం నుంచి అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- ఎస్ఈ శ్రావణ్‌కుమార్



నిజాంసాగర్(జుక్కల్): వ్యవసాయరంగంతో పాటు గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఎస్ఈ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మల్లూర్ 33 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ కరెంట్ సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరద నీటి ప్రవాహాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలయన్నారు. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి కరెంట్ సరఫరాకు ఆటంకం లేకుండా చూశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ అరవింద్, ఏఈ మోహన్ నాయక్, లైన్‌మన్లు శ్రీనివాస్, శేర్ అలీ, నాగరాజు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు కంట్రోల్ రూం
- ప్రారంభించిన అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి క్రైం: వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను అదనపు కలెక్టర్ విక్టర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కంట్రోల్ రూంను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 08468–220051కు సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం శ్రీకాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిశీలన



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న 11 నెంబర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను బుధవారం నీటి పారుదల శాఖ ఎస్ఈ దక్షిణమూర్తి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వద్ద కట్ట కుంగిపోయి మట్టి కొట్టుకుని పోయింది. దీంతో ప్రధాన కాలువ ప్రమాదకరంగా మారింది. మరమ్మతులకు రూ.10 లక్షల నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఎస్ఈ దక్షిణమూర్తి, డీఈఈ శ్రీచంద్, ఏఈ నితిన్ వాస్తవ పరిస్థితిని గమనించారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయిస్తామన్నారు. వారి వెంట గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, మమ్మాయి కాశీరాం, సత్యం, కృష్ణ, బస్వయ్య, మంద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి
- ఎస్పీ రాజేశ్‌చంద్ర



కామారెడ్డి రూరల్: ప్రతి పోలీసు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో నిబద్ధతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ రాజేశ్‌చంద్ర పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగం బాధ్యత, సేవతో కూడుకున్నదని తెలిపారు. కామారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన రికార్డు రూంను ప్రారంభించారు. స్టేషన్ శుభ్రత, రికార్డుల నిర్వహణ, దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసుల ప్రగతిని సమీక్షించారు. ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేడీ, సస్పెక్ట్, రౌడీ షీటర్ల కదలికలను క్రమం తప్పకుండా పరిశీలించి, నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములు, సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ రామన్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనస్ ప్రశ్నార్థకం..!

యాసంగి సన్నాలకు అందని వైనం
- జిల్లాకు రావాల్సింది రూ.89 కోట్లు
- ఇస్తారనే ఆశతో ఖరీఫ్‌లో మళ్లీ సన్నరకం వరి సాగు
- స్పష్టత లేక రైతుల్లో ఆందోళన



ఖరీఫ్‌లో 1.40 లక్షల ఎకరాల్లో..
యాసంగిలో కంటే ఖరీఫ్‌లో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 3.18 లక్షల ఎకరాల్లో వరి పండించారు. అందులో 1.40 లక్షల ఎకరాల్లో సన్నరకం వడ్ల సాగు జరిగి ఉండొచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, నిజాంసాగర్, నాగిరెడ్డిపేట తదితర మండలాల పరిధిలో వరి కోతలు మొదలుకాగా, కేంద్రాలకు ధాన్యం తరలివస్తోంది.

కామారెడ్డి క్రైం: సన్నరకం వడ్ల సాగును ప్రోత్సహిస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. అందులో భాగంగా ఖరీఫ్‌లో నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం, యాసంగి నుంచి బోనస్ ఊసెత్తడం లేదు. యాసంగిలో రైతులు విక్రయించిన సన్నాలకు సంబంధించిన బోనస్ డబ్బులు ఇప్పటికీ పడలేదు. అయితే, ఖరీఫ్‌లోనైనా ఇవ్వకపోతారా అనే ఆశతో మళ్లీ సన్నాలు సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతలు జరుగుతున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు, ప్రకటన రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెండింగ్‌లో రూ.89 కోట్లు..

గత యాసంగిలో జిల్లా వ్యాప్తంగా రైతులు మొత్తం 2,61,110 ఎకరాల్లో వరి సాగుచేశారు. దాంట్లో దాదాపు 60 వేలకు పైగా ఎకరాల్లో సన్నరకం వడ్లను పండించారు. మార్చి నెలాఖరు నుంచి కొనుగోళ్లు ప్రారంభించి మొత్తం 3.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అందులో 1,78,416 మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం సేకరణ చేపట్టగా, అందుకు సంబంధించిన రూ.886 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. బోనస్ డబ్బుల కోసం సన్నాలు పండించిన 72,852 మంది రైతులు మాత్రం ఎదురుచూస్తూనే ఉన్నారు.

ఆశతోనే సాగు చేశాం..



బోనస్ వస్తుందనే ఆశతోనే యాసంగిలో సన్నరకం వడ్లు పండించాను. 6 నెలలు దాటినా ఇంకా బోనస్ డబ్బులు పడలేదు. సాగు ఖర్చులు బాగా పెరిగాయి. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించాలి.

– అల్లం రాములు, మైలారం, నస్రుల్లాబాద్ మండలం

5.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావొచ్చు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి క్రైం: ఖరీఫ్ సీజన్‌లో 5.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లు, అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. భారీ వర్షాలు కురిస్తే వరద నీరు రాకుండా కొనుగోలు కేంద్రాలను ఎత్తయిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన యంత్రాలు, కాంటాలు, టార్పాలిన్లు, రవాణా వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

ప్రభుత్వానికి నివేదించాం..
యాసంగి బోనస్ డబ్బులకు సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాకు రూ.89 కోట్ల వరకు రావాల్సి ఉంది. నేరుగా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతాయి. బోనస్ అనేది నిరంతర ప్రక్రియనే. ఎప్పుడు వస్తాయనే దానిని ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

– శ్రీకాంత్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి

టీకా కోసం వెళ్తూ అనంతలోకాలకు..
- టిప్పర్ రూపంలో ఎదురుగా వచ్చిన మృత్యువు
- తాత, ఇద్దరు మనుమలు, కుమార్తె మృతి
- జంగంపల్లిలో నెత్తురోడిన జాతీయ రహదారి



కిషన్ (ఫైల్)



జాస్లీన్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన టిప్పర్

భిక్కనూరు: టీకా వేయించేందుకు మూడు నెలల పసికందుతోపాటు వెళ్లిన ముగ్గురిని టిప్పర్ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. భిక్కనూరు మండలం జంగంపల్లి బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసు కున్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. తాడ్వాయి మండలం కరడ్‌పల్లి గ్రామానికి చెందిన మెరుగు కిషన్ (54) అనే వ్యక్తి 20 ఏళ్లుగా ఆదిలాబాద్ జిల్లా రణదీవ్‌నగర్ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను ఒక నెల కిషన్, మరో నెల తన సోదరుడు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో తన వంతు వచ్చినప్పుడు కిషన్ శాబ్దీపూర్ శివారులో ఉన్న అద్దె ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి ఉండేవాడు. కిషన్ కుమార్తె జాస్లీన్ (30)కు ఖమ్మం జిల్లా ముష్టికుంటకు చెందిన పాస్టర్ ఆగమని ప్రకాశ్‌తో వివాహం చేశాడు. జాస్లీన్‌కు జోయల్ ప్రకాశ్(4), మూడు నెలల జాడ్సన్ అనే కుమారులు ఉన్నారు. జాస్లీన్ ఇటీవల కొడుకులతో వచ్చి తండ్రి, నానమ్మ–తాతయ్యలతో కలిసి ఉంటోంది. అయితే, జాడ్సన్‌కు నెల టీకా ఇచ్చే సమయం అయ్యింది. దీంతో భిక్కనూరు ప్రభుత్వాసుపత్రిలో ఆశవర్కరుగా పనిచేసే బంధువును కలిసి జాడ్సన్‌కు టీకా ఇప్పించవచ్చని భావించిన జాస్లీన్ ఈ విషయాన్ని తండ్రి కిషన్‌కు వివరించింది. దీంతో కిషన్ తన ఎలక్ట్రిక్ స్కూటీపై జాస్లీన్, మనుమలు జోయల్ ప్రకాశ్, జాడ్సన్‌లను తీసుకొని భిక్కనూరుకు బయల్దేరాడు. జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా ఎదురుగా రాంగ్ రూటులో టిప్పర్ వేగంగా వచ్చి ఎలక్ట్రిక్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో నలుగురు గాలిలో ఎగిరి కిందపడ్డారు. కిషన్, జాస్లీన్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న చిన్నారులు జోయల్ ప్రకాశ్, జాడ్సన్‌లను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్కలేదు. అప్పటికే చిన్నారులిద్దరూ మరణించారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ, కామారెడ్డి ఇన్‌చార్జి శ్రీనివాస్ రావు, రూరల్ సీఐ రామన్ పరిశీలించారు. డ్రైవర్ అజాగ్రత్తగా టిప్పర్‌ను రాంగ్‌రూట్‌లో నడపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని డ్రైవర్ రాజిరెడ్డిని అరెస్టు చేశామని ఎస్సై ఆంజనేయులు వివరించారు.

18 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న అక్టోబర్ నెలకు సంబంధించిన ఉచిత సన్నబియ్యం పంపిణీ ఈ నెల 18 వరకు కొనసాగుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటగా ఈ నెల 15 వరకు చివరి తేదీ అని ప్రకటించగా మరో మూడురోజులు రేషన్ పంపిణీ గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రేషన్‌బియ్యం తీసుకోని వినియోగదారులు సంబంధిత షాపుల్లో బియ్యం తీసుకోవాలని సూచించారు.

మిగిలింది మూడు రోజులే..
- ఇప్పటి వరకు అందిన దరఖాస్తులు 267
- మద్యం దందాపై ఆసక్తి తగ్గిందా!



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మద్యం దుకాణాలు కేటాయించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతోపాటు దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించి, 23న అధికారులు డ్రా ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు. అయితే దరఖాస్తులు చేసుకునే గడువు మూడు రోజులే మిగిలి ఉండగా 49 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు కేవలం 267 మాత్రమే. దసరా తర్వాత దరఖాస్తులు వెల్లువలా వస్తాయని అనుకున్నా, ఆ స్థాయిలో రావడం లేదు. శుభ ముహూర్తాలు వచ్చినా దరఖాస్తు చేసుకునేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మద్యం దుకాణాలకు దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెరగడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో 49 మద్యం దుకాణాలకు బుధవారం నాటికి 267 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి హన్మంతరావ్ 'సాక్షి'కి తెలిపారు. కామారెడ్డి స్టేషన్ పరిధిలోని 15 దుకాణాలకు 63, దోమకొండ పరిధిలోని 8 దుకాణాలకు 44, ఎల్లారెడ్డి పరిధిలోని 7 దుకాణాలకు 41, బాన్సువాడ పరిధిలోని 9 వైన్సులకు 59, బిచ్కుంద పరిధిలోని 10 దుకాణాలకు 60 దరఖాస్తులు వచ్చాయి.

గతంలో పోటీ..

జిల్లాలో మద్యం దుకాణాలకు రెండేళ్లకోసారి నిర్వహించే కేటాయింపు దరఖాస్తులకు గతంలో పెద్ద ఎత్తున పోటీ ఉండేది. 2021–23 సంవత్సరాలకు 49 మద్యం దుకాణాలకు 960 దరఖాస్తులు రాగా, ప్రభుత్వానికి రూ.19.20 కోట్ల ఆదాయం వచ్చింది. 2023–25 సంవత్సరాలకు 49 మద్యం దుకాణాలకు 2,204 దరఖాస్తుల ద్వారా రూ.44.08 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి కూడా మద్యం దుకాణాలు అంతే ఉండగా, గతంలో కన్నా ఎక్కువ దరఖాస్తులు వస్తాయని అధికారులు భావించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 267 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ నెల 18తో అంటే మరో మూడు రోజుల్లో గడువు ముగియనుంది. ఆఖరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

డీసీసీ పదవికి పెరిగిన పోటీ!
- ఇప్పటికే పది మందికి పైగా దరఖాస్తు
- మరికొందరు దరఖాస్తు చేసుకునేందుకు సన్నద్ధం
- ఎవరి ప్రయత్నాల్లో వారు...

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పెరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో జిల్లా అధ్యక్ష పదవి అంటే పార్టీ పరంగా ప్రోటోకాల్ ఉంటుందనే భావనతో పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు తమ గాడ్‌ఫాదర్లతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తర్వాత పట్టణానికి చెందిన సీనియర్ నేత కైలాస్ శ్రీనివాస్‌రావ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించారు. అప్పటి నుంచి ఆయనే కొనసాగుతున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డీసీసీ కొత్త కార్యవర్గాల నియామకానికి పార్టీ నాయకత్వం కసరత్తు చేసింది. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో ఏఐసీసీ పరిశీలకులు రాజ్‌పాల్ కరోలా ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తొలుత జిల్లా నాయకులతో జిల్లాస్థాయి సమావేశం కామారెడ్డిలో జరిగింది. తర్వాత కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల సమావేశాలు మంగళ, బుధవారాల్లో పూర్తయ్యాయి. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల సమావేశాలు కూడా గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నారు. అయితే, జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడంతో చాలా మంది నేతలు పోటీ పడుతున్నారు. ఇప్పటికే పది మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన పంపరి శ్రీనివాస్, కామారెడ్డి మండలానికి చెందిన నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డిలు ఏఐసీసీ పరిశీలకుడిని కలిసి దరఖాస్తు చేసుకున్నారు. సదాశివనగర్ మండలానికి చెందిన లింగాగౌడ్, రామారెడ్డి మండలానికి చెందిన గీరెడ్డి మహేందర్‌రెడ్డి, నారెడ్డి మోహన్‌రెడ్డి, గాంధారికి చెందిన ఆకుల శ్రీనివాస్, నిజాంసాగర్‌కు చెందిన మల్లికార్జున్ తదితరులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తన ప్రధాన అనుచరుడు, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌కు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గ సమావేశంలో అందరూ కలిసి ఆయన పేరును ప్రతిపాదించారు. అయితే ఇప్పటికే డీసీసీ అధ్యక్షులుగా ఉన్నవారిని తిరిగి నియమించకపోవచ్చని అంటున్నారు. దీంతో కైలాస్ శ్రీనివాస్‌రావ్ పదవిపై డైలామా నెలకొంది. ఆయనను కాదంటే షబ్బీర్ అలీ ఎవరి పేరును సూచిస్తారన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది. కాగా, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తన అనుచరుడు లింగాగౌడ్‌కు ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా తనకు అవకాశం ఇవ్వాలని రామారెడ్డి మండలానికి చెందిన మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అదే మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి కూడా డీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తన అనుచరుడు మల్లికార్జున్‌కు ఇవ్వాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.



డీసీసీ పదవికి దరఖాస్తులు అందజేస్తున్న పంపరి శ్రీనివాస్, విజయ్ కుమార్ రెడ్డి

మరికొందరి ఆసక్తి...
డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోవాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు వెల్లడించడంతో మరికొందరు నేతలు దరఖాస్తు చేసుకునేందుకు రెడీ అవుతున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి మరికొందరు నేతలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆరాటపడుతున్న నేతలు ఎన్నికలు వాయిదా పడడంతో డీసీసీ పదవికి ఓ దరఖాస్తు పెడితేపోలా అనే ఆలోచనలో ఉన్నారు. నామినేటెడ్ పదవులు రానివాళ్లంతా డీసీసీ పదవులపై కన్నేశారు. దీంతో పోటీ పెరిగే అవకాశం ఉంది.

బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌లో రెండు గ్రూపులు ఉన్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తమ అనుచరులను రంగంలోకి దింపే అవకాశం ఉందని అంటున్నారు. గాంధారి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ ఆకుల శ్రీనివాస్ తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కామారెడ్డి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డి తనకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడిగా ఉన్న సీనియర్ నేత పంపరి శ్రీనివాస్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఏకాభిప్రాయంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక
- ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

ఎల్లారెడ్డి: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయం మేరకు డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేస్తామని ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు, రాజ్యసభ ఎంపీ రాజ్‌పాల్ కరోల స్పష్టం చేశారు. బుధవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సంఘటన సృజనా అభియాన్, నియోజవకర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్‌పాల్ కరోలా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామిక విలువలకు పెద్దపీట వేస్తామని, అందరి ఏకాభిప్రాయ నిర్ణయంతోనే కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ప్రార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణ పూర్తయ్యాక టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు తమ నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు రజిత వెంకట్రామ్‌రెడ్డి, బండారి పరమేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఓట్ చోర్..గద్దీ చోర్ ఆందోళనకు మద్దతుగా రాజ్‌పాల్ కరోల, మదన్‌మోహన్ రావు, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులు సంతకాలు చేశారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల, పక్కన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు

మంచు దుప్పటి..
జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 8 గంటలు దాటినా పొగమంచు వీడటం లేదు. మద్నూర్ మండలంలో బుధవారం ఉదయం రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– మద్నూర్(జుక్కల్)



క్లుప్తంగా

'టీచర్లతో పాఠశాల తనిఖీ బృందాలు ఏర్పాటు చేయొద్దు'

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయులతో పాఠశాలల పరిశీలన బృందాల ఏర్పాటు అశాస్త్రీయ, అవివేకమైన ఆలోచనా విధానమని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ విజయరామరాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. పాఠశాలల పర్యవేక్షణ, తనిఖీలు, ఉపాధ్యాయుల పనితీరు గమనించే క్రమంలో సహచర ఉపాధ్యాయులపై తనిఖీ బృందాల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1,473 మంది టీచర్లతో 165 బృందాలు ఏర్పాటు చేయడం ద్వారా వీరిని పాఠశాల విధులకు దూరం చేయడంతో పాటు, అనేక గొడవలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎంఈవోలు, హెడ్‌మాస్టర్లు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలను తనిఖీలకు వినియోగించాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ విజయరామరాజు కోరారు.

బీజేపీలో పలువురి చేరిక



బాన్సువాడ: బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజేష్, అన్నారం మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, బుక్కారెడ్డి, మల్గొండ, మహేంద్ర, ప్రసాద్, నర్సాగౌడ్ తదితరులు బుధవారం బీజేపీలో చేరారు. బాన్సువాడ బీజేపీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి యువత బీజేపీలో చేరుతోందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల నాటికి క్షేత్రస్థాయిలో బీజేపీ బలపడుతుందన్నారు. నాయకులు సాయికిరణ్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్‌గౌడ్, చిదురసాయిలు, కోనాల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బుధవారం షీటీమ్ బృందం సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, చైన్ స్నాచింగ్ తదితర నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు అలాగే 8712686094 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎమర్జెన్సీ ఉంటే 100 నంబరుకు డయల్ చేయాలని సూచించారు. కానిస్టేబుల్ శ్రీశైలం, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ నిర్వహణకు రూ.50 వేల విరాళం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో ఈనెల 17, 18 తేదీలలో స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారి దేవి సింగ్ పేర్కొన్నారు. దీంతో బుధవారం బ్లూబెల్స్ పాఠశాల కరస్పాండెంట్ సంజీవరెడ్డి ఆట పోటీల నిర్వహణ ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా రూ.50 వేల చెక్కును స్థానిక ఎంఈవో దేవి సింగ్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో దేవి సింగ్ మాట్లాడుతూ..క్రీడల నిర్వహణకు సంజీవరెడ్డి రూ.50 వేల విరాళంగా ఇవ్వడం ఎంతో శుభపరిణామమని అన్నారు. ఆట పోటీల నిర్వహణ అధికారి రమణారావు, బ్లూబెల్స్ పీటీ లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వీసీలో సూచనలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలు సౌకర్యవంతంగా సొంత ఇంట్లో నివసించాలనే కలను సహకారం చేస్తూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు.జిల్లాలో మొత్తం 11,679 ఇళ్ల నిర్మాణాలకు మహిళల పేరిట అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాకు మంజూరు చేసిన అన్ని ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభి, త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీసీలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి, డీఆర్డీవో సురేందర్, డీపీవో మురళి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



కొర్పోల్‌లో ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేష్



కాటేపల్లిలో .. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం ఆయన కొర్పోల్, బోనాల్, బాయంపల్లి, బాణాపూర్, బాణాపూర్ తండా, మెంగారం గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. అలాగే బాయంపల్లి, బాణాపూర్ తండాల్లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): నాణ్యతతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి ప్రదీప్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు ఆర్ట్స్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్, ఈకో బజార్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఫుడ్ ఫెస్టివల్, క్యాంపస్ ఈకో బజార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు వస్తువుల అమ్మకం, మార్కెటింగ్ ప్రణాళిక, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు, స్టాళ్ల ఏర్పాటు, సుందరీకరణ, పర్యావరణ స్నేహ పూర్వక ఉత్పత్తులు, సేవలను తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ వివరించారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగ మేళా

కామారెడ్డి అర్బన్: అపోలో ఫార్మసీలో ఉద్యోగాల కోసం ఈనెల 17న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని 121 నంబర్ గదిలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రజనీ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. డి-ఫార్మా, బి-ఫార్మా(పీసీఐ) అర్హతతో స్త్రీ, పురుష ఫార్మసిస్టులకు 40 ఖాళీలు(రూ.17,644 వేతనం), డి-ఫార్మా, బి-ఫార్మా అర్హతతో పురుషులకు ట్రెయినీ ఫార్మసిస్టులకు 20 (రూ.16,144 వేతనం), పదవ తరగతి అర్హతతో ఫార్మసీ అసిస్టెంట్ పురుషులకు 30(రూ.15,879 వేతనం), రిటైల్ ట్రెయినీ 10 ఖాళీలు పురుషులకు (రూ.12వేల వేతనం) ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 72079 17714, 76719 74009 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఖోఖోకు క్రీడాకారులు ఎంపిక



జోనల్ స్థాయి ఖోఖోకు ఎంపికైన క్రీడాకారులు

నిజాంసాగర్(జుక్కల్):అండర్-14, అండర్-17 విభాగం జిల్లా స్థాయి పోటీలకు బుధవారం మండలంలోని మల్లూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఎంఈవో తిరుపతి రెడ్డి తెలిపారు. నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాల పరిధిలోని పిట్లం జోన్ తరపున జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు.పీడీలు రాజు,జావిద్,సంజీవ్,సంతోష్, సాయిలు,ప్రియాంక,అన్నపూర్ణ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

నస్రుల్లాబాద్: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మాధవరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో వారిని అభినందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తరపున ఈనెల 16 నుండి 18 వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ రాహుల్, పీఈటీ ప్రవీణ్ పాల్గొన్నారు.

లింగంపేట నుంచి నలుగురు విద్యార్థులు..



గురుకుల పాఠశాలలో అభినందిస్తున్న సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. ఎస్‌జీఎఫ్‌లో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడల్లో అండర్-14, అండర్-17 విభాగంలో ప్రతిభ కనపర్చిన నలుగురు విద్యార్థులు ఆత్మారాం, అరివింద్, శ్రీప్రణీత్, కార్తీక్ వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

తాడ్వాయి నుంచి ఇద్దరు క్రీడాకారులు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లిలో గల ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్‌లో అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చంద్రవతి, పీడీ నగేష్ తెలిపారు. కబడ్డీ విభాగంలో ఏ. సమన్విత, వాలీబాల్ విభాగంలో వి.నందిని ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారన్నారు. క్రీడాకారులను పాఠశాలలో బుధవారం అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన వ్యాపారి పడిగేల సుభాష్ సేట్ సతీమణి వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అదే విధంగా గురుస్వామి ఈశ్వర్ దయాళ్‌రెడ్డి మాతృమూర్తి గత వారం రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే బుధవారం వారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సమయపాలన పాటించని అధికారులపై చర్యలు

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



పల్లె దవాఖానాలో మందులను పరిశీలిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): సమయపాలన పాటించని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండల తహసీల్ కార్యాలయంలో ఎన్‌హెచ్-765డి విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతుల సమావేశానికి సబ్ కలెక్టర్ వచ్చారు. తహసీల్ కార్యాలయం అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం పల్లె దవాఖానాను సందర్శించారు. పల్లె దవాఖానా వైద్యురాలితో పాటు ఏఎన్‌ఎం విధులకు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె దవాఖానాలో నెల రోజుల నుంచి రోగుల రిజిష్టర్ నిర్వహణ చేపట్టకపోవడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సబ్‌కలెక్టర్ ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితిని వివరించారు. ఆమె వెంట తహసీల్దార్ లత, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యం చేరుకోవాలి

నిజాంసాగర్(జుక్కల్): గ్రామ పంచాయతీల వారిగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై, నిర్మాణాలకు ముందుకు రాని లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. ఇళ్ల నిర్మించుకునే ఉద్దేశం లేకుంటే రద్దు చేసి కొత్తవారికి ఇళ్లు మంజూరు చేయించాలని సూచించారు. అలాగే ఎన్‌హెచ్-765డి రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని రైతులకు సూచించారు. పట్టాదారు పాసు బుక్కులు ఉంటే నష్ట పరిహారం అందుతుందన్నారు. శిఖం, అసైన్డ్, భూములు ఉన్న రైతులకు పరిహారం రావడం కష్టమన్నారు. తహసీల్దార్ లత, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

పాడి సంపదను పెంచుకోవాలి

డిప్యూటీ కలెక్టర్ రవితేజ



దేమికలాన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు వ్యవసాయంతో పాటు పాడి సంపదను పెంచుకోవాలని డిప్యూటీ కలెక్టర్ రవితేజ అన్నారు. దేమికలాన్‌లో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందన్నారు. పశుగ్రాసాన్ని పెంచుకొని పశువులకు ఆహారంగా ఇచ్చినట్లయితే పాల శాతం పెరుగుతుందన్నారు. అనంతరం జిల్లా పశువైద్యాధికారి భాస్కరన్ మాట్లాడుతూ.. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. లేకుంటే పశువులలో పాలదిగుబడి గణనీయంగా తగ్గి, పశువు పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతింటుందన్నారు. గాలికుంటు రోగం వస్తే పశువులకు కాళ్ల గిట్టెలు, నోట్లో పుండ్లు అవుతాయని, దీంతో పశువులు మేతమేయక చనిపోయే ప్రమాదముందన్నారు. పశుగ్రాసం ఆవశ్యకత, రకాలు, ప్రభుత్వం ఇస్తున్న గడ్డి విత్తనాల రకాల గురించి వివరించారు.అసిస్టెంటు డైరెక్టర్ శ్రీనివాస్, మండల పశు వైద్యాధికారి రమేష్, వీఎల్‌వో పోచయ్య, జేవీవోలు కొండల్‌రెడ్డి, ప్రేంసింగ్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కలామ్ అడుగుజాడల్లో నడవాలి



జిల్లా ఆస్పత్రిలో కలాం చిత్రపటం వద్ద నివాళులు

సాక్షి నెట్‌వర్క్:అణు శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి, దివంగత నేత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం జిల్లాలో పలు చోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ..అణు శాస్త్రవేత్తగా ఆయన భారతదేశానికి అందించిన సేవలను కొనియాడారు. కలామ్ అడుగుజాడల్లో నడవాలని, ప్రతి భారతీయుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని కోరారు.



బిచ్కుంద: మైనార్టీ స్కూల్‌లో..

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘం నాయకులు రాష్ట్ర అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లిన కార్మిక సంఘం నాయకులు భవన నిర్మాణ రంగాల సంక్షేమ మండలి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వెంకట రమణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. డివిజన్ కేంద్రమైన ఎల్లారెడ్డిలో కార్మిక శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, సంఘం కార్యాలయం కోసం స్థలం కేటాయింపు, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నేతలు దానబోయిన శ్యామ్, అబ్దుల్ రజాక్, నిమ్మ కృష్ణ, బేల్దార్ తుకారాం, సంఘమేశ్వర్, సాయిలు, పిట్ల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకే కుటుంబంలోని ముగ్గురి ఆత్మహత్యాయత్నం

- మృతిచెందిన తండ్రి. చికిత్స పొందుతున్న తల్లి, కొడుకు
- పెళ్లి విషయమై గొడవలే కారణం



దాసరి కిషన్ (ఫైల్)

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందులో తండ్రి మృతి చెందగా, తల్లి, కొడుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా.. శివాజీనగర్ కు చెందిన దాసరి కిషన్(68)కు భార్య నాగమణి, ఇద్దరు కొడుకులు వంశీ, బాలకృష్ణ ఉన్నారు. పెద్దకొడుకు వంశీ గల్ఫ్‌కు వెళ్లి తిరిగి వచ్చి, మద్యానికి బానిసయ్యాడు. చిన్న కొడుకు బాలకృష్ణతో కలిసి కిషన్ కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. బాలకృష్ణకు వివాహం జరుగగా, వంశీకి పెళ్లి కాలేదు. ఈవిషయమై మంగళవారం అతడు తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. దీంతో వంశీ గడ్డిమందు తాగి చనిపోతానంటూ మందు తాగాడు. వెంటనే వంశీ నుంచి తల్లి గడ్డిమందు డబ్బా తీసుకొని ఆమె తాగింది. ఆమె నుంచి కిషన్ డబ్బా తీసుకొని తాగాడు. దీంతో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి వారిని వెంటనే చికిత్స కోసం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున కిషన్ చికిత్స పొందుతు మృతిచెందగా, మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై మృతుడి చిన్నకుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటన స్థలానికి వెళ్లి వారు విచారణ చేపట్టారు. కిషన్ మృతిచెందిన విషయాన్ని ఆస్పత్రి యాజమాన్యం పోలీసులకు ఇవ్వకపోవడం, మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించడంపై పోలీసులు ఆస్పత్రికి నోటీసులు జారీ చేశారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

- ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



డిచ్‌పల్లి: మండలంలోని హైవేపై ఓ ప్రయివేట్ బస్సు అదుపుతప్పి ఇంధన ట్యాంకర్‌ను ఢీకొని, సమీపంలోని ఏడో బెటాలియన్ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. ఈఘటనలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బుధవారం హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయలుదేరింది. డిచ్‌పల్లిలోని పోలీస్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే బస్సు ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఢీకొని బంకులోకి దూసుకెళ్లింది. దీంతో పెట్రోల్ బంక్‌లో ఉన్న వాహనదారులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే బస్సు సమీపంలోకి వచ్చి నిలిచిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. అజాగ్రత్తగా బస్సు నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ప్రభాకర్ తేజపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు: ఇద్దరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి హన్మకొండకు బయలుదేరింది. ఈక్రమంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బైక్‌ను బస్సు వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు

విద్యుత్ షాక్‌తో జీపీ కార్మికుడికి ..



బీబీపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో గాయపడ్డాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు కొంగరి చంద్రం బుధవారం పెద్దమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ బల్బులు అమర్చడానికి స్తంభం ఎక్కాడు. అప్పటికే విద్యుత్ సరఫరా ఉండడంతో అతని చేతులకు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. దీంతో కుడి కాలు విరిగింది. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఎల్లారెడ్డి: పట్టణంలోని వైన్స్‌లో ఇటీవల చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజారెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని త్రిశూల్ వైన్స్‌లో ఈనెల 12న చోరీ జరిగింది. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.15 వేలను అపహరణకు గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా నిందితుడిగా మండలంలోని పోసానిపల్లి గ్రామానికి చెందిన జంగం నర్సింలుగా గుర్తించారు. అతడిని ఇంటి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కూలీ పనులు చేసుకునే నిందితుడు మద్యం కోసం డబ్బులు చాలక చోరీలకు పాల్పడుతుంటాడని ఆయన తెలిపారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి ..

నిజామాబాద్‌సిటీ: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై బుధవారం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన భగీరథ, ఫికిలాల్‌గా గుర్తించారు. వారు రైళ్లలో తరచు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. నిందితులు సుమారు 36 గ్రాముల బంగారం, 155 గ్రాముల వెండి, రూ.లక్ష 32 వేలు నగదును దొంగలించినట్లు అంగీకరించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 15మంది అరెస్టు

రుద్రూర్: కోటగిరిలోని రెండు పేకాట స్థావరాల్లో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సునీల్ బుధవారం తెలిపారు. కోటగిరి రిక్రియేషన్ క్లబ్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 13,610 నగదు, ఐదు ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కోటగిరిలోని ఓ ఇంట్లో పేకాడుతున్న పదిమందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 15,190 నగదు, పది ఫోన్లు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకరు తప్పించుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.


సాలూర మండలంలో..

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15,040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నందిపేట మండలంలో..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని దేవి పట్టణం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి, పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 21,600 నగదుతోపాటు 6ఫోన్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్ రాజ్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



అక్మత్‌బేగ్(ఫైల్)

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన అక్మత్‌బేగ్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సదరు విద్యార్థి బుధవారం బోధన్‌లోని కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థి తండ్రి కరామత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీబీపేటలో ఒకరు..

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన బట్టుపల్లి నాగరాజుగౌడ్ (33) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ బుధవారం తెలిపారు. నాగరాజు గౌడ్ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి తండ్రి సిద్ధరామగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. ఎవరికైన అతడి ఆచూకీ తెలిస్తే పోలీసు స్టేషన్‌లో తెలపాలని ఎస్సై పేర్కొన్నారు.



నాగరాజుగౌడ్

గాంధారిలో ఒకరు..



పత్తి బాల్‌రాజు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన పత్తి బాల్‌రాజు(40) అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాల్‌రాజు మంగళవారం ఉదయం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాల్‌రాజు భార్య పత్తి మేఘన బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పత్తి క్వింటాల్ @ రూ.7,220



మద్నూర్(జుక్కల్): పత్తి మార్కెట్‌కు ప్రసిద్ధి చెందిన మద్నూర్‌లో పత్తి కొనుగోళ్లకు వ్యాపారులు బుధవారం ముహూర్తం చూసి కొనుగోళ్లు ప్రారంభించారు. పత్తి ఫ్యాక్టరీల యాజమానులు పత్తి కొనుగోళ్ల ప్రారంభం సందర్భంగా పూజలు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోలు మొదలు పెట్టారు. రైతుల నుంచి క్వింటాలు పత్తికి రూ.7,220 ధరతో తీసుకున్నామని వారు తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్: ఒకరి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: మండలంలో బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై మహేశ్ వివరాలు ఇలా.. వెల్లుట్ల గ్రామానికి చెందిన పండుగ లక్ష్మణ్(36) బుధవారం మోటార్ సైకిల్‌పై బాన్సువాడ నుంచి గ్రామానికి బయలుదేరాడు. ఆజామాబాద్ గ్రామ శివారులోని మూల మలుపు వద్ద బైక్ అదుపుదప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ప్రమాదంలో ఒకరు..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రైల్వేస్టేషన్-జాన్కంపేట స్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని దుబ్బకు చెందిన ట్రాన్స్‌జెండర్ మీరా అలియాస్ నారాయన్ కామాజీ అనే వ్యక్తి బుధవారం మధ్యాహ్నం నిజామాబాద్ రైల్వేస్టేషన్-జాన్కంపేట స్టేషన్‌ల మధ్య పట్టాలపై వస్తున్న రైలుకు ఎదురువెళ్లారు. ఈక్రమంలో రైలు ఢీకొని తీవ్ర గాయాలై మృతిచెందారు.ఈ ఘటన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతిచెందిన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమయ్యింది. వివరాలు ఇలా.. బాలాజీనగర్ తండాకు చెందిన రుడావత్ గణేశ్ (48) మంగళవారం చేపలు పట్టడానికి ఎల్లారెడ్డి పెద్దచెరువులో దిగగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహం కోసం గాలించగా బుధవారం మధ్యాహ్నం లభ్యమయ్యింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.